సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



సీవీకే రావు చిరస్మరణీయుడు

రంగస్థల కళాకారుడు సీవీకే రావు చిరస్మరణీయుడని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు.

8లో



'విద్యుత్'తో జర జాగ్రత్త!

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం సమర్పించి నివేదన జరిపారు. కార్యక్రమంలో వేద పండితులు పద్మనాభ శర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, ధర్మకర్తలు, చింతా నాగరాజు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, సంకా వెంకటరామారావు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

ఆస్పత్రి అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచ : పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలంటూ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపామని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు తెలిపారు. ఆస్పత్రి 'అప్‌గ్రేడ్ అయ్యేనా?' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆస్పత్రిని మార్చాల్సిన అవసరాన్ని వివరిస్తూ నివేదిక సమర్పించామని, అతి త్వరలోనే అప్‌గ్రేడ్ అవుతుందని అన్నారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు చేశామన్నారు.

'నవ' సేవలు అభినందనీయం



తాగునీటి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ వినీత్

పాల్వంచ : నవభారత్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. పట్టణంలోని శేఖరం బంజరలో నవ లిమిటెడ్ ఏర్పాటుచేసిన సురక్షిత తాగునీటి కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలుషితనీటితో వచ్చే అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు సురక్షిత తాగునీటి కేంద్రం ఉపయోగపడుతుందని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్, డీజీఎం ఆర్.పి.కిరణ్, చీఫ్ లైజన్ ఆఫీసర్ వి.ఖాదరేంద్రబాబు, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డి.శ్యాం, గ్రామస్తులు కిశోర్, శేఖర్ పాల్గొన్నారు.

నేడు భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం ఎన్నికలు

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగుల అసోసియేషన్ గుర్తింపు ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. కర్మాగారంలోని క్యాంటీన్-1లో పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 6నుండి మధ్యాహ్నం 3.30గంల వరకు పోలింగ్ జరగనుండగా, ఎన్నికల అధికారిగా మోహన్‌కుమార్ వ్యవహరిస్తారు. మొత్తం 570 మందికి హక్కు ఉండగా, తొమ్మిది ఆఫీస్ బేరర్ పదవులకు గాను నిర్వహిస్తున్న ఎన్నికల్లో 24 మంది పోటీ పడుతున్నారు. కాగా, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ ఒక కూటమిగా, టీఆర్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ మరో కూటమిగా బరిలోనిలిచాయి. పోలైన ఓట్లను శనివారం లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని బీఎంఎస్ జాతీయ నాయకుడు దిలీప్ సత్ పుతే డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో సీఐఎల్ డైరెక్టర్ పర్సనల్ వినయ్‌రంజన్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో బీఎంఎస్ తరఫున ఆయన మాట్లాడారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని సిఫారసు చేసినందున వెంటనే అమలుచేయాలన్నారు. ఈమేరకు యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కోలిండియా డైరెక్టర్ వెల్లడించారని బీఎంఎస్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు.

అవినీతి బంధం!



మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్

బీటీపీఎస్ కాంట్రాక్టర్లతో అధికారుల కుమ్మక్కు

- పక్కదారి పడుతున్న 'ప్లాంట్' సిమెంట్
- అదనపు భారం పడుతున్నా పట్టించుకోని అధికారులు
- నిజాయితీపరులకు దక్కని గుర్తింపు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గును మండించి నీటిని వేడి చేస్తారు. తద్వారా వచ్చిన ఆవిరి శక్తితో టర్బైన్లను తిప్పడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. ఇక్కడ వేర్వేరు స్వభావాలు కలిగిన బొగ్గు, నీరు కలిస్తేనే విద్యుత్ బయటకు వస్తుంది. అలాగే మణుగూరులోని భద్రాద్రి థర్మల్ విద్యుత్ స్టేషన్‌లో వేర్వేరు పనులు చేయాల్సిన కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కవుతున్నారు. ఫలితంగా వస్తున్న కాసుల వర్షంతో ఖజానా నింపుకుంటున్నారు.

భారీ అవసరాలే ఆసరాగా..

బీటీపీఎస్ ప్రభుత్వ రంగ సంస్థ. ఇదొక భారీ పరిశ్రమ. వేల కోట్ల రూపాయలతో దీన్ని నిర్మించారు. ఈ క్రమంలో ఇనుము, సిమెంట్.. ఇలా ఏ వస్తువులైనా భారీ మొత్తంలోనే అవసరమవుతాయి. దీంతో బీటీపీఎస్ లాంటి సంస్థలకు అవసరమైన నిర్మాణ సామగ్రిని బల్క్ ఆర్డర్ కింద తక్కువ ధరకే కంపెనీలు సరఫరా చేస్తాయి. ప్రభుత్వం లేదా ప్లాంట్ అధికారులు కొంచెం చొరవ చూపిస్తే సబ్సిడీ ధరకు కూడా సరఫరా చేసేందుకు వెనుకాడవు. బీటీపీఎస్ పరిధిలో ఇప్పటికీ అనేక నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. 930 ఎకరాల్లో విస్తరించిన ఈ భారీ పరిశ్రమ ప్రహరీ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. దీంతో పాటు వివిధ కార్యాలయాలు, గోదాములు, యాష్‌ప్లాంట్, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పనులను టెండర్ల ద్వారా వేర్వేరు కాంట్రాక్ట్ సంస్థలు దక్కించుకున్నాయి. ఇందులో కొందరు నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ పనులు చేస్తుండగా మరికొందరు డబ్బుల కోసం తప్పుదారి పడుతున్నారు.

సామగ్రి తారుమారు..

బీటీపీఎస్ పరిధిలో పలు నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లలో కొందరు అతి తెలివి ప్రదర్శిస్తున్నారు. బీటీపీఎస్ కోటాలో ఇనుము, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిని అతి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇలా తెచ్చిన వస్తువులను కేవలం బీటీపీఎస్‌లో చేపట్టే నిర్మాణాలకే ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే సదరు కాంట్రాక్టర్లు చేపట్టే ఇతర పనులకు కూడా ఈ సామగ్రిని తరలిస్తున్నారు. ఉదాహరణకు బీటీపీఎస్‌లో 'ఎక్స్' అనే నిర్మాణం కోసం వెయ్యి బస్తాల సిమెంట్‌ను అతి తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఓ కాంట్రాక్టర్ అందులో నాలుగైదు వందల బస్తాలను బీటీపీఎస్ ఆవల తాను చేపడుతున్న ఇతర పనులకు తరలిస్తున్నాడు. ఆ తర్వాత తక్కువ పడిన బస్తాలను మరోసారి బీటీపీఎస్ కోటాలోనే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. ఇలాంటి పనులు చేయడంలో బీటీపీఎస్‌లో ప్రముఖుడిగా వెలుగొందుతున్న కాంట్రాక్టర్ ప్రథమ స్థానంలో ఉన్నట్లు ప్లాంట్ వర్గాలు చెబుతున్నాయి.

మనోడేగా.. ఓకే

బీటీపీఎస్ కోటాలో తక్కువ ధరకే సిమెంట్, ఇనుము ఇతర వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా కాంట్రాక్టర్ల జేబుల్లోకి అయాచితంగా లాభాలు వచ్చిపడుతున్నాయి. ఈ అవినీతి వ్యవహారం చూసీ చూడనట్టుగా వదిలేయడంతో అధికారులకు మామూళ్లు ముడుతున్నాయి. దీంతో కాంట్రాక్టర్లు నిర్మాణ పనులకు సంబంధించి ఎలాంటి ఇండెంట్ పెట్టినా దానికి అడ్డు చెప్పకుండా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నారు. చివరకు ఈ అవినీతి బాగోతం ముదురుపాకానికి చేరుకుంది. అవసరం లేకుండా నిర్మాణ వ్యయాన్ని పెంచే స్థాయికి వెళ్లింది. అంతా తాము చెప్పినట్టే నడుస్తుంది కదా అని కొందరు నాసిరకంగా పనులు చేసేందుకు సైతం వెనుకాడడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

విజిలెన్స్ విభాగం అవసరం..

బీటీపీఎస్‌లో నిజాయితీగా పని చేసే వాళ్లకు గుర్తింపు లేకుండా పోతోందని కొందరు కాంట్రాక్టర్లకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ వేళ్లూనుకుపోయిన అవినీతిని వెలికి తీసి, పరిస్థితులను చక్కదిద్దేందుకు పటిష్టమైన విజిలెన్స్ విభాగం ఏర్పాటు చేయలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులపై థర్డ్ పార్టీచే విచారణ జరిపించాలని కోరుతున్నారు. ప్లాంట్‌లో అస్తవ్యస్తంగా మారిన పరిస్థితులను ఇకనైనా చక్కదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సైన్స్‌ఫేర్ పేరు మార్పు

కొత్తగూడెంఅర్బన్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ సైన్స్ అండ్ మేథమెటిక్స్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహించే సైన్స్ ఫేర్‌కు రాజ్యస్తాయి బాల్ వైజ్ఞానిక ప్రదర్శనగా నామకరణం చేశారని డీఈఓ సోమశేఖరశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహణ తేదీలను త్వరలోనే వెల్లడిస్తామని, ఉపాధ్యాయులు, విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఎన్నికలొస్తేనే ప్రజలు గుర్తొస్తారా ?



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పొంగులేటి



మణుగూరులో ప్రజలకు అభివాదం చేస్తూ..

- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు

భద్రాచలం /చర్ల : బీఆర్ఎస్ పార్టీ నేతలకు, ఎమ్మెల్యేలకు ఎన్నికలొస్తేనే ప్రజలు, సంక్షేమ పథకాలు గుర్తొస్తాయని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన భద్రాచలం, చర్ల, మణుగూరు మండలాల్లో డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా భద్రాచలంలో జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భద్రాచలం పూర్తిగా నష్టపోయిందన్నారు. రామాలయానికి రూ. 100 కోట్లు, కరకట్ట నిర్మాణానికి రూ.1000 కోట్లు ప్రకటించి నిధులు విడుదల చేయకుండా ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. మళ్లీ ఎన్నికల సమయం వచ్చేటప్పటికీ మాయ మాటలతో గారడీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాల దరఖాస్తులకు రెండు, మూడు రోజులు మాత్రమే గడువు ఇస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టబోతున్నారని జోస్యం చెప్పారు. అనంతరం దుమ్ముగూడెం మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్, సీపీఎం కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారిలో దుమ్ముగూడెం జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, నలుగురు ఎంపీటీసీలు, ముగ్గురు సర్పంచులు, ముగ్గురు మాజీ సర్పంచులతో పలు సంఘాల నాయకులు ఉన్నారు. చర్ల మండలానికి చెందిన 1400 మంది కార్యకర్తలు సీపీఎం నాయకులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేత తెల్లం వెంకట్రావుతో పాటు చర్ల ఎంపీపీ గీదా కోదండరామయ్య, జెడ్పీటీసీ ఇర్పా శాంత, భద్రాచలం, చర్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సరెళ్ల నరేష్, ఆవుల విజయభాస్కర్ రెడ్డి, నాయకులు బుడగం శ్రీనివాస్, చింతరెల రవికుమార్, అడబాల వెంకటేశ్వరరావు, బలుసు నాగ సతీష్, బొలిశెట్టి రంగారావు, తాళ్లపల్లి రమేష్ గౌడ్, బంధం శ్రీనివాస్ గౌడ్, గండేపల్లి హనుమంతరావు, సరెళ్ల వెంకటేష్, చింతిరేల సుధీర్, తరుణ్ మిత్ర, రాము, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు లంక శ్రీనివాస్, బైరెడ్డి సీతారామారావు, దర్శి సాంబశివరావు, శివ, రత్నం రమాకాంత్, రజినీకాంత్, ఎండీ నవాబ్ పాల్గొన్నారు.

పొంగులేటికి ఘన స్వాగతం..

మణుగూరు రూరల్ : టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గురువారం మణుగూరులో ఘన స్వాగతం లభించింది. పీవీ కాలనీ క్రాస్‌రోడ్డు నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌లోని అమరవీరుల స్థూపానికి, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ, అంబేడ్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పొంగులేటి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, నాయకులు నాగేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, శ్రీవాణి, విజయ్‌గాంధీ పాల్గొన్నారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం పంచాయతీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు కాకా అశోక్, వార్డు సభ్యులు కుంజా శ్రీను, బూరెడ్డి స్వాతి, చుంచు విజయ, వాంకుడోత్ పూర్ణ, ఏనుగు శోభారాణి నెల్లిపాక పీఏసీఎస్ డైరెక్టర్ ఏనుగు కవిత గురువారం కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌కు ఆరుగురు సర్పంచ్‌ల రాజీనామా

గుండాల: ఆళ్లపల్లి మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తమను అవమానపరుస్తున్నారంటూ మర్కోడు, నడిమిగూడెం, బోడాయికుంట, రాఘవాపురం, అడవిరామవరం, వెంకటాపురం గ్రామాల సర్పంచ్‌లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు చేస్తున్న అభివృద్ధి పనులను తాము ప్రజల్లోకి తీసుకెళుతున్నామని, రేగాతో తమకు ఎలాంటి విభేదాలు లేవని చెప్పారు. పార్టీ మండల నాయకులే తమకు చెడుపేరు తీసుకొస్తున్నారని ఆరోపించారు. సర్పంచ్ పదవుల్లో కొనసాగుతాం కానీ బీఆర్ఎస్లో ఉండలేమని స్పష్టం చేశారు. వారితో పాటు మండల వ్యాప్తంగా కొందరు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సైతం పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

వనమాకు ఘన స్వాగతం



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో వనమాకు భారీ గజమాల వేస్తున్న కార్యకర్తలు

భారీ మోటార్ సైకిల్ ర్యాలీ



జూలూరుపాడు సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం)/సుజాతనగర్ /జూలూరుపాడు : తన పదవి విషయంలో వచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన తర్వాత తొలిసారి గురువారం కొత్తగూడెం వచ్చిన ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు బీఆర్ఎస్ శ్రేణులు జూలూరుపాడు వద్ద ఘన స్వాగతం పలికాయి. మొదట జూలూరుపాడు సాయిబాబా ఆలయంలో, ఆ తర్వాత సుజాతనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి ప్రధాన సెంటర్ల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యానగర్ కాలనీ, పోస్టాఫీస్ సెంటర్‌లో వనమాకు క్రేన్‌తో భారీ గజమాల వేశారు. ప్రదర్శనకు ముందు గిరిజన సంప్రదాయనృత్యాలు, కోలాటాలు అలరించాయి. వనమాకు స్వాగతం పలుకుతూ పలు సెంటర్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దేవుడి ఆశీర్వాదం, కేసీఆర్, కేటీఆర్‌తో పాటు కార్యకర్తలు, ప్రజల అండదండలతో తనకు అంతా మంచే జరుగుతుందని అన్నారు. తుదిశ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటానని చెప్పారు. న్యాయం గెలిచి, అన్యాయం ఓడిందని వ్యాఖ్యానించారు. కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొంటూ 40 ఏళ్లుగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నానని, కొత్తగూడెం ప్రజల నుంచి తనను ఎవరూ విడదీయలేరని, కొత్తగూడెం నుంచే మళ్లీ పోటీ చేస్తానని ప్రకటించారు. ఇందుకోసం నేటి నుంచే కార్యాచరణకు దిగుతానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తానని కేసీఆర్ భరోసా ఇచ్చారని, జీవితాంతం సీఎంకు రుణపడి ఉంటానని అన్నారు. ర్యాలీ సందర్భంగా చాలా చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గణేష్ టెంపుల్ ఏరియాలో అంబులెన్స్ ర్యాలీ మధ్యలో ఇరుక్కోగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసి ఆ వాహనాన్ని పంపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి జేవీఎస్ చౌదరి, వనమా తనయులు రాఘవేందర్ రావు, రామకృష్ణతో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు సహకరించొద్దు

అడవిరామారంలో పోలీసుల సహపంక్తి భోజనాలు



గొత్తికోయలతో కలిసి భోజనం చేస్తున్న పోలీసులు

గుండాల: అభివృద్ధికి ఆటంకంగా నిలిచే అసాంఘిక శక్తులకు ఎవరూ సహకరించొద్దని, అలాంటి వారి సమాచారాన్ని తమకు తెలియచేయాలని సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్ సూచించారు. గుండాల స్టేషన్ పరిధి అడవిరామారంలో గొత్తికోయలతో కలిసి గురువారం పోలీసులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గొత్తికోయలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. తద్వారా సమాజంపై అవగాహన పెరగడమే కాక ఉపాధి లభిస్తుందని తెలిపారు. అంతేకాక గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని, అనారోగ్యం బారిన పడితే నాటు మందులు వాడకుండా ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. ఆతర్వాత విద్యార్థులకు నోట్స్ బుక్స్, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రాంబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలంటే ఇంత నిర్లక్ష్యమా ?

- వార్డెన్లపై కలెక్టర్ ప్రియాంక ఆగ్రహం
- పాల్వంచ జ్యోతిరావ్ పూలే గురుకులంలో తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

పాల్వంచరూరల్: పాత పాల్వంచలోని జ్యోతిరావ్ పూలే గురుకుల బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం తనిఖీ చేశారు. విద్యార్థినుల గదులు, మెనూను పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు లైట్లు కూడా సక్రమంగా లేవని, ఇలా ఉంటే విద్యార్థులు ఎలా చదువుకుంటారని వార్డెన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వహణపై ఆర్‌సీఓకు ఫోన్ చేసి ఇంత నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. వసతి గృహాలు పరిశుభ్రతకు మారుపేరుగా ఉండాలని సూచించారు. విద్యార్థుల చదువుకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులపైనే ఉందని చెప్పారు. మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంతో వార్డెన్(కేర్‌టేకర్)కు షోకాజ్ నోటీసు జారీచేయాలని ఆర్‌సీఓను ఆదేశించారు. తాను మళ్లీ పరిశీలనకు వస్తానని, అప్పటికి పరిస్థితిలో మార్పు రాకుంటే బాధ్యులైన వారిని సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డెన్ విజయకుమారి, ప్రిన్సిపాల్ జయరాజ్ పాల్గొన్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది



స్నాన ఘట్టాల వద్ద నిలిచిపోయిన బురద, ఒండ్రు మట్టి

- భద్రాద్రిలో స్నాన ఘట్టాలపై పేరుకుపోయిన ఒండ్రు
- జారి పడుతున్న భక్తులు
- కర్మకాండలు, పుణ్యస్నానాలకు ఇబ్బందులు
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గినప్పటికీ.. పేరుకుపోయిన బురద భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ప్రతి రోజూ దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులు ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత శ్రీసీతారామ చంద్రస్వామి వారి దర్శనానికి వెళ్తారు. ఇక కర్మకాండలు, పితృ కార్యాలకు చేయించుకునే వారు సైతం నదిలో స్నానాలు ఆచరిస్తుంటారు. అయితే స్నాన ఘట్టాలపై భారీగా ఒండ్రుమట్టి పేరుకుపోయి ఉండడంతో నదిలోకి దిగే క్రమంలో మెట్లపై జారి పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల వరదలకు ఓ భారీ వృక్షం మోడు కొట్టుకొచ్చి ప్రధాన మెట్లపై అడ్డంగా పడింది. దీనిని తొలగించేందుకు సైతం అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన షెడ్లు వరదలతో కొట్టుకుపోయాయి. దీంతో మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లపై వరదకు కొట్టుకొచ్చిన చెత్తను తొలగించలేదు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో సాయంత్రం ఆరు గంటలు దాటితే గోదావరి తీరం అంధకారమయం అవుతోంది. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది.

తలనీలాలకూ తప్పని ఇక్కట్లు..

భద్రాచలం వద్ద గోదావరి నదికి వరదలు తగ్గి పది రోజులు దాటినా ఇప్పటివరకు అధికారులు బురద తొలగింపునకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. స్నానఘట్టాల వద్ద ప్రధాన మెట్లపై కాలినడక దారి మాత్రమే ఏర్పాటు చేశారు. స్నానఘట్టాలపై బురద, ఒండ్రు అడుగు మేర నిలిచింది. కల్యాణ కట్ట భవనంలో సైతం బురద ఉండడంతో తలనీలాలు సమర్పించే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. పది రోజులు దాటినా బురద సమస్య పరిష్కారంపై అధికారులు దృష్టి సారించడం లేదంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి స్నానఘట్టాల వద్ద మెట్లపై పేరుకుపోయిన బురద తొలగించాలని కోరుతున్నారు.

స్నానానికి ఇబ్బందిగా ఉంది

నెల్లూరు నుంచి కుటుంబంతో కలిసి భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చాం. స్నానఘట్టాల వద్ద మెట్లపై బురద ఉండడంతో స్నానం చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డాం. మెట్లపై బురద ఉండడంతో జారిపోతామని భయపడుతూ దిగాల్సి వచ్చింది. – వెంకటరమణ, భక్తురాలు, నెల్లూరు

శుభ్రమైన నీరు ఏర్పాటు చేయాలి

గోదావరి వరదల సమయంలో స్నానం చేసేందుకు శుభ్రమైన నీటిని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. లోతుకు వెళ్లే పరిస్థితి లేక మెట్ల వద్ద బురద నీటిలో స్నానం చేయాల్సి వచ్చింది. తాత్కాలిక వాటర్ షవర్లు ఏర్పాటు చేసే విషయాన్ని అధికారులు ఆలోచించాలి. – ముత్తయ్య, నిజామాబాద్

క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

పాల్వంచరూరల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. మండల పరిధిలోని కేశవాపురం, బసవతారకకాలనీ, జగన్నాథపురం గ్రామపంచాయతీల భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాలను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం తోగ్గూడెంలో జరిగిన ఈవీఎం ద్వారా ఓటింగ్‌పై అవగాహన సదస్సులో మాట్లాడారు. ఓటర్లు ఈవీఎంలపై అవగాహన పెంచుకోవాలని, అపోహలకు గురికాకుడదని అన్నారు. గ్రామ పంచాయతీ భవనలను త్వరితగతిన నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.అప్పారావు, ఎంపీఓ పి.రంగా, ఏపీఎం రాంబాబు, సర్పంచ్‌లు బాదావత్ శాంతి, అనిత, కాశమ్మ, ఉపసర్పంచ్‌లు శ్రీను, పంచాయతీ కార్యదర్శులు సాయిరాం, రాంబాబు, శైలజ, రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డీడీఆర్ఎఫ్ శిక్షణ




డీడీఆర్ఎఫ్ బృందానికి శిక్షణ ఇస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో డీడీఆర్ఎఫ్(డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) సిబ్బందికి రెండు వారాలుగా నిర్వహిస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సహాయ సహకారాలు అందించేందుకు పోలీసులు డీడీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేశారు. సీపీఆర్, వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించి ప్రాథమిక చికిత్స అందించడం తదితర అంశాలపై 50 మంది పోలీసు సిబ్బందికి ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డాక్టర్లు చైతన్య, మధు తదితరులు శిక్షణ ఇచ్చారు. ఈ బృందం భద్రాచలంలో నిరంతరం అందుబాటులో ఉంటుందని ఏఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని ఏఎస్పీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు రెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసరావు, శ్రీనివాస్, సుమంత్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో నవవధువు మృతి

కేసముద్రం: అనుమానాస్పదస్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని ధర్మారంతండా పంచాయతీలో గురువారం జరిగింది. తండాకు చెందిన గుగులోతు రాందాస్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం శేఖరంబంజరకు చెందిన బానోతు శ్రీను కుమార్తె బిందు(24)తో గత నెల 4న వివాహం జరిగింది. పెళ్లికి ముందునుంచే బిందుకు అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేవి. ఈక్రమంలో గురువారం ఉదయం ఇంట్లోని నీటిసంపులో పడిన ఆమెను జిల్లా కేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అయితే, బిందు దుస్తులు ఉతుకుతుండగా ఫిట్స్ రావడంతో పక్కనే నీటిసంపులో పడి మృతి చెందినట్లు ఆమె భర్త రాందాస్, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా పెళ్లయిన 10 రోజులనుంచే అల్లుడు తన కూతురును కొట్టేవాడని, ఆమె మృతి విషయంలో అనుమానం ఉందని బిందు తండ్రి శ్రీను ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా, పెళ్లయిన 36 రోజులకే కూతురు మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడు...



సాయిమనోజ్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం నారాయణపురంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన గబ్బిలాల సాయిమనోజ్(18) తన స్నేహితులు అడపా నాని అలియాస్ సీతారామచౌదరి, కోరుకొండ రాజేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బేతుపల్లి నుంచి మర్లపాడు వెళ్తున్నారు. ఈక్రమంలో నారాయణపురం మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. సాయిమనోజ్ తల పైనుంచి లారీ వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, నాని, రాజేష్‌కు గాయాలు కావటంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మనోజ్ కుటుంబ సభ్యులు చేరుకుని మృతదేహంపై పడి రోదించిన తీరు కంటతడి పెట్టించింది. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడు ఆత్మహత్య

దమ్మపేట: ముష్టిబండ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి తంగిరాల నరేంద్ర(18) గురువారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

'విద్యుత్'తో జర జాగ్రత్త!

- వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం
- గతేడాది విద్యుదాఘాతంతో 37 మంది మృతి
- 102 పశువులు మృత్యువాత
- జాగ్రత్తలు పాటిస్తే ఆపదల నుంచి దూరం

భద్రాచలంఅర్బన్: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వర్షాలకు, ఈదురుగాలులకు కరెంట్ తీగలు తెగిపడుతుంటాయి. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్లకు సరైన రక్షణ లేకపోవడం, విద్యుత్ తీగలు, వేలాడటం, స్తంభాలు ఒరగడం, విరిగిపోవడం వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కరెంట్ మోటార్ల వద్ద రైతులు ఏమరపాటుగా విద్యుత్ తీగలను తాకడం, అనుమతి లేకుండా డిస్ట్రిబ్యూషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు మార్చేటప్పుడు, స్తంభాలపై సర్వీస్ వైర్లను, వీధి దీపాలను సరిజేసే క్రమంలో, సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి మాట్లాడటం సమయంలో కూడా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో 2022–23 ఏడాదిలో విద్యుదాఘాతంతో 37 మంది మృతి చెందారు. 102 పశువులు చనిపోయాయి.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

ఇవి పాటించాలి

- వర్షం వచ్చిన సమయంలో విద్యుత్ స్తంభాలను తాకకూడదు.
- నీటిలో పడిన విద్యుత్ వైర్ల జోలికి వెళ్లకూడదు.
- భవన నిర్మాణ పనులు చేసేటప్పుడు విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలి..
- తడి బట్టలు, తడి చేతులతో విద్యుత్ పరికరాలు ముట్టకోకూడదు. మరమ్మతులు చేయరాదు.
- పిల్లలకు అందేంత ఎత్తులో స్విచ్ బోర్డులు ఉంచకూడదు
- స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మూత్ర విసర్జన చేయొద్దు.
- విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టివేయొద్దు.
- ఇంటి వరండాలో జీఐ వైర్లతో హౌస్ వైరింగుకు దగ్గర్లో దండంగా కట్టి తడి బట్టలను ఆరవేయకుండా చూసుకోవాలి.
- విద్యుత్‌స్తంభం, వ్యవసాయ మోటారు మధ్య దూరం ఉంటే సర్వీస్‌వైరు లూజై మోటార్‌పై ప్రభావం చూపుతుంది. దూరం లేకుండా చూడాలి.
- విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు కరెంట్ నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫ్యూజ్ బాక్స్, స్టార్టర్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి.
- ఓల్టేజీని దృష్టిలో పెట్టుకుని సరైన ఫ్యూజ్ వేయాలి. ఫ్యూజ్ ఇండికేటర్ బల్బు, స్టార్టర్ ఒక చెక్కపై బిగించుకోవాలి. ఇనుప డబ్బా వాడొద్దు.
- విద్యుత్ సరఫరాలో లోపం ఉంటే మెకానిక్‌తో మరమ్మతులు చేయించాలి. పరిజ్ఞానం లేకుండా సొంతంగా మోటార్‌ను ముట్టుకోవద్దు.
- రైతులు మోటార్లు వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ వైర్లు తెగిపడినా, నేలవాలినా ప్రజలు రిపేర్లు చేయొద్దు. విద్యుత్ శాఖ సిబ్బందికి/ 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ ప్రసారం జరుగుతున్నప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తపడాలి. జిల్లాలో ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

–రమేష్, విద్యుత్ శాఖ ఎస్ఈ

నాణ్యమైన కేబుల్ వ్యవస్థ..



వ్యవసాయ బోర్లకు పాత సర్వీస్ వైర్లు ఉంటే మార్చుకోవాలి. రైతులు మోటార్ల వద్దకు వెళ్లినా అప్రమత్తంగా ఉండాలి. ఉదయాన్నే పొలానికి వెళ్లేవారు కరెంట్ వైర్లను సరిచూసుకోవాలి. పొలాల్లో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలు జరుగుతాయి. రైతులు వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన కేబుల్ వ్యవస్థను, ఎర్తును ఏర్పాటు చేసుకోవాలి.

–వేణు, విద్యుత్‌శాఖ, ఏడీఈ(ఆపరేషన్స్), భద్రాచలం

అవగాహన కల్పించాలి



వర్షాకాలంలో రైతులు నిత్యం పొలం పనుల్లో పడి, విద్యుత్ శాఖ కారణంగా మృతి చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఈ సమస్య పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇలాంటివి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– ఆకోజు సునీల్ కుమార్, భద్రాచలం

20 కేసులు.. రూ.28 లక్షల ఆభరణాలు..

- జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు ఖమ్మం–సికింద్రాబాద్ రైళ్లలో చోరీలు
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: వరుస చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు రూ.28.43 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను చోరీ చేయగా, అతనిపై 20 కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. గురువారం కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ డాక్టర్ జి.వినీత్ కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఆటోలో సంచితో వెళ్తున్న నితిన్ పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి ఫింగర్ ప్రింట్ తీసుకుని విచారించగా చోరీల విషయం వెల్లడైంది. నిందితుడి నుంచి రైల్వే కేసుల్లో రూ.14,22,000 విలువైన 23.7 తులాల బంగారం, జిల్లాలో నమోదైన కేసుల్లో రూ.5,76,000 విలువైన 9.6 తులాల బంగారు ఆభరణాలు, రూ.1,40,000 విలువైన 187 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసి, తాకట్టు పెట్టిన రూ.7,05,000 విలువైన 17 తులాల బంగారం రికవరీ చేయాల్సి ఉంది. ఈ చోరీల సొత్తు మొత్తం విలువ సూమారు. రూ.28,43,000 ఉంటుందని ఎస్పీ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు కరీంనగర్, సిద్దిపేట, విజయవాడ ప్రాంతాలకు రాత్రిపూట వెళ్తూ ప్రయాణికులు నిద్రలో ఉండగా చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఇళ్లతోపాటు సికింద్రాబాద్, వరంగల్, ఖమ్మం రూట్లో తిరిగే రైళ్లలో చోరీలు చేశాడు. నిందితుడిపై రైల్వే పరిధిలో 13 కేసులు, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ ఠాణాల్లో రెండు చొప్పున, చుంచుపల్లి పోలీస్ స్టేషన్లో మూడు.. మొత్తం 20 కేసులు నమోదై ఉన్నాయి. నితిన్‌పై సస్పెక్ట్ షీట్‌ను కూడా తెరిచామని ఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన కేసులను ఛేదించిన లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సీసీఎస్ ఎస్‌ఐలు ప్రవీణ్, సుమన్, సంతోష్, రాజమౌళి, హెడ్ కానిస్టేబుళ్లు రమణ, రఘురామిరెడ్డిలను ఎస్పీ అభినందించారు.

సీఈఐఆర్.. 469



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్పీ వినీత్ తదితరులు

కొత్తగూడెంటౌన్: చోరీకి గురైన 469 సెల్‌ఫోన్లను పోలీసులు సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) ద్వారా పోలీసులు రికవరీ చేశారు. జిల్లాలో 469 మంది సీఐఈఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా, సెల్‌ఫోన్లను బ్లాక్ చేసి 168 మొబైల్స్‌కు సంబంధించిన డేటా కూడా తిరిగి సేకరించారు. బాధితుల్లో 54 మందికి సెల్‌ఫోన్లు అందించగా, మిగతా వారికి త్వరలోనే అందించనున్నారు. ఈ మేరకు ఎస్పీ డాక్టర్ జి.వినీత్ గురువారం వివరాలు వెల్లడించారు.

కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన తోకల రవి, సుమంత్, భాస్కర్‌రావు, సుజిత తదితరులు అకారణంగా తమ ఇంటి ప్రహరీ కూల్చివేయడంతోపాటు బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు తోకల జానయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమరారం ఎస్సై గిరిధర్‌రెడ్డి గురువారం తెలిపారు.

బైక్ ఢీకొని పంచాయతీ కార్మికుడికి తీవ్ర గాయాలు

గుండాల: బైక్ ఢీకొని పంచాయతీ కార్మికుడు గాయపడ్డ ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పంచాయతీ కార్మికుడు ఈసం గోపయ్య గురువారం తోటి కార్మికులతో కలిసి ట్రాక్టర్‌లో చెత్త సేకరణకు వెళ్లాడు. గుండాల ప్రధాన రహదారి రామాలయం వద్ద ఓ షాపులోని చెత్తను ట్రాక్టర్‌లో వేసేందుకు వెళ్తున్నాడు. అదే సమయంలో తాడ్వాయి మండలం బయ్యక్క పేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు గార్ల మండలం కిష్టారం గ్రామానికి బైక్‌పై వెళ్లి వస్తున్నారు. బైక్ అతివేగంతో ఢీకొనడంతో గోపయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా గుండాల ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ద్విచక్ర వాహనదారులకు స్వల్ప గాయాలయ్యాయి. గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యత మరింతగా పెరిగింది

ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం వెంకన్న

భద్రాచలంటౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో కార్మికులు, ఉద్యోగులపై బాధ్యత మరింతగా పెరిగిందని సంస్థ ఖమ్మం రీజనల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న అన్నారు. గురువారం ఆయన మొదటిసారి భద్రాచలం డిపోకు రావడంతో ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా సంస్థ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని, వారితో మర్యాదగా వ్యవహరించి మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం బస్సులను పరిశీలించి, గ్యారేజ్‌లో మెకానిక్‌లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఉద్యోగులతో కలిసి డిపో ఆవరణంలో మొక్కలు నాటారు. డిపో నుంచి ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన పది మందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బి.రామారావు, వెంకటేశ్వరరావు, గౌతమి, సాహితి, నరసింహారావు, నాగేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.



డిపోలో మెకానిక్‌లతో మాట్లాడుతున్న ఆర్ఎం

● అంగన్‌వాడీల పోరు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగోన్నతులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు వి.మల్లికార్జున్, గోనె మణి, రెడ్డి అరుణ, భూక్య లలిత, కోరం శ్రీలత, ఎం ఇంద్ర, నారం సునీత, పూనెం నర్సమ్మ, సరోజిని, భారతి పాల్గొన్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడ్డ నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామసమీపంలో ఉన్న సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు 15.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు బైక్‌లపై తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులు హైదరాబాద్‌కు చెందిన నిఖిల్, శ్రీనివాసగౌడ్, వరంగల్‌కు చెందిన సునీల్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ తిరుపతి తెలిపారు. రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. సీఐలు రాంప్రసాద్, సర్వేశ్వర్‌రావు, ఎస్సైలు రమాదేవి, నూరుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

టేకులపల్లి: మండలంలోని తడికలపూడి పంచాయతీ కోక్యాతండాలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన బోడ శంకర్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. కుటుంబీకులు, స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న బట్టలు, సామగ్రి మంటల్లో కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

'ఎమ్మెల్యే' ర్యాలీలో నగదు చోరీ

సుజాతనగర్: ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ర్యాలీకి వచ్చిన వ్యక్తి నగదును దుండగులు చోరీ చేశారు. మండలంలోని రాంజీతండా గ్రామానికి చెందిన గుగులోత్ రాంబాబు ఎమ్మెల్యే వనమాకు స్వాగతం పలికేందుకు గురువారం నాయకులగూడెం గ్రామానికి వచ్చాడు. ర్యాలీలో రద్దీ ఉండగా, రాంబాబు జేబులో ఉన్న రూ.29,500 నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ర్యాలీ ముగిసిన అనంతరం నగదు చోరీకి గురైనట్లు గుర్తించానని, ఆ నగదు డ్వాక్రా గ్రూపునకు సంబంధించినదని ఆవేదన వ్యక్తం చేశాడు.

అల్యూమినియం వైరు..

టేకులపల్లి: విద్యుత్ సరఫరా చేసే అల్యూమీనియం వైర్ చోరీకి గురైంది. ఎస్‌ఐ జి.రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని పెగళ్లపాడు పంచాయతీ తెలుగూరులో ఉన్న ఎత్తిపోతల పథకం వద్ద విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఈ బుజ్జి కన్నయ్య, లైన్‌మెన్ దేవ్‌సింగ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. 11 కేవీ లైన్ స్తంభం నుంచి మరో స్తంభానికి విద్యుత్ సరఫరా అయ్యే అల్యూమినియం వైరు కండక్టర్లు కనిపించలేదు. సుమారు రూ.7 వేల విలువైన 30 కేజీల వైరు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీవీకే.రావు చిరస్మరణీయుడు

వర్ధంతి సభలో మాజీ ఎంపీ ఉండవల్లి



సీవీకే.రావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఉండవల్లి, శ్రీనివాసరెడ్డి, వీరయ్య తదితరులు

చర్ల: ఏజెన్సీ ప్రాంత ప్రజలు అభివృద్ధి కోసం నిత్యం తపించిన రాజకీయ వేత్త సీవీకే.రావు చిరస్మరణీయులని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ నాయకుడు, రంగస్థల కళాకారుడు, నటుడు సీవీకే.రావు మొదటి వర్ధంతి సభ చర్ల మండలం రైస్‌పేటలోని ఆయన స్వగృహంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండవల్లితో పాటు కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని సీవీకే.రావు ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉండవల్లి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాల కల్పనకు పాటుపడ్డారని తెలిపారు. ఇప్పుడు ఆయన కుమారుడు కూడా అదే ఒరవడి కొనసాగిస్తుండడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ ఏజెన్సీలో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు సీవీకే.రావు కృషి చేశారన్నారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, బుడగం శ్రీనివాసరావు, నాయకులు, సీవీకే.రావు కుటుంబీకులు చింతిర్యాల రవికుమార్, డాక్టర్ తెల్లం వెంకట్రావు, సీవీ.రమణ, సీవీ.సతీష్‌కుమార్, జ్యోత్స్న, దాట్ల వీరభద్రరాజు, చింతూరి వెంకట్రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ఉండవల్లి

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని ఉపాలయాల్లో కూడా పూజలు చేశారు.

శంకుస్థాపన చేసి వదిలేశారు...



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

- బీఆర్ఎస్ కుట్ర ఫలితమే సీతారామ మళ్లింపు
- అఖిలపక్ష సమావేశంలో నాయకులు

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టుకు ఇల్లెందు నియోజకవర్గంలో శంకుస్థాపన చేసిన సీఎం కేసీఆర్ ఆతర్వాత ప్రాజెక్టును మళ్లించి స్థానిక రైతులకు అన్యాయం చేయాలని అఖిలపక్షం నాయకులు ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టు సాధన కమిటీ ఆధ్వర్యంలో ఇల్లెందులో గురువారం ఏర్పాటుచేసిన అఖిలపక్ష రాజకీయ పక్షాల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా ఆరులక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామంటూ సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అదేరోజు భక్త రామదాసు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. కానీ భక్తరామదాసు ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేసిన ప్రభుత్వం.. రోళ్లపాడు వద్ద సీతారామ పనులను మాత్రం వదిలేసిందని ఆరోపించారు. అంతేకాకుండా రోళ్లపాడు ప్రాజెక్టుకు రావాల్సిన నీటిని సత్తుపల్లి, పాలేరు మీదుగా ఆంధ్రాకు తరలించే కుట్ర జరుగుతోందని తెలిపారు. కాంగ్రెస్ ద్వారా ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ సైతం ఈ విషయంలో నోరు ఎందుకు మెదపడం లేదో చెప్పాలన్నారు. ఏదిఏమైనా రోళ్లపాడు ప్రాజెక్టు ద్వారా సీతారామ జలాలను సాధించేందుకు జరిగే పోరాటంలో అన్నివర్గాల ప్రజలు కలిసిరావాలని కోరారు. ఈసమావేశంలో న్యూడెమోక్రసీ నాయకుడు గౌని అయిలయ్య, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు సాబీర్‌పాషా, అన్నారపు కనకయ్య, కాంగ్రెస్ నాయకుడు భూక్యా దళ్‌సింగ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, ముద్రగడ వంశీ, చంద్ర అరుణ, రాసుద్దీన్, ఊక్లా, బిచ్చ, మోకాళ్ల రమేష్, దేవరకొండ శంకర్, బందం నాగయ్య, సక్రు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్ : పట్టణంలోని చర్ల రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట గురువారం రాత్రి కొంత మంది ఆందోళన చేశారు. స్థానికుల సమాచారం మేరకు.. సదరు ఆస్పత్రిలో విధులు నిర్వహించే ఓ వ్యక్తి అదే ఆస్పత్రిలో పనిచేసే యువతికి అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టాడు. దీంతో ఆ వ్యక్తిని తమకు అప్పగించాలంటూ యువతి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో ఆస్పత్రి వైద్యులు వచ్చి ఆందోళనకారులకు సర్దిచెప్పారు. అదే సమయంలో బ్లూకోట్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు.

గురుకుల పాఠశాలలో తహసీల్దార్ విచారణ

బోనకల్: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎం.అరవింద్ బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఆయనతో ఇటుకలు మోయించే సమయాన ప్రమాదం జరిగిందని తెలియడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీంతో గురువారం తహసీల్దార్ పున్నంచందర్ పాఠశాలకు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మంలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి ఆయన తల్లిదండ్రులతో కూడా మాట్లాడారు. ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.